క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో జెడ్పీ చైర్మన్



వినాయకుని ప్రసాదం అందుకుంటున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు గణిత ప్రజ్ఞాధారణ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో శనివారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గణితావధాని అరుణశివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వేచి చూసి వెనుదిరిగిన టీడీపీ నేతలు



కార్యక్రమం రద్దు కావడంతో హోటల్ నుంచి వెళ్లిపోతున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : నిరీక్షించి, వెనుతిరగాల్సి వచ్చిందని పలువురు టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లా పర్యటన నేపథ్యంలో చిత్తూరు నగరానికి సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్లో నిరీక్షించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఆ పార్టీ నేతలు రాత్రి 7 గంటల వరకు వేచిచూశారు. అయితే పర్యటన రద్దు అయినట్లు తెలియడంతో ఆ హోటల్ నుంచి వెనుదిరిగారు. రోడ్డు పైకి వచ్చి నిరసనలు చేసేందుకు ప్రయత్నించగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు టీడీపీ నేతలను చెదరగొట్టారు.

పిల్లలకు టీకాలు వేయించండి

పూతలపట్టు: మండలంలోని చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రవీణ అన్నారు. మండలంలోని పీహెచ్‌సీలో శుక్రవారం ఆశావర్కర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ మాట్లాడుతూ మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేసుకోని చిన్నపిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ మిషన్ ఇంద్ర ధనస్సు ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు దేవరాజులురెడ్డి అన్నారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 117 జీఓతో సవరణకు ప్రభుత్వం పరిశీలించాలన్నారు. డీఎస్సీ నిర్వహించే వరకు పాఠశాలల్లోని ఖాళీలను అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బి.మోహన్, పురుషోత్తం, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ



తిమ్మోజుపల్లెలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయాలన్నీ శుక్రవారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంబంధించి వివిధ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం తిమ్మోజుపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నూర్‌మహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

తమిళనాడుకు వెళ్లి..



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఈ వలంటీర్ పేరు రవితేజ. బొమ్మసముద్రం గ్రామానికి చెందిన సరోజమ్మకు రోడ్డు ప్రమాదం జరగడంతో కాళ్లు విరిగిపోయాయి. తమిళనాడులోని హొసూరులో చికిత్స తీసుకుంటూ తన కుమార్తె ఇంటిలో లేవలేని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి సరోజమ్మకు పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. ఇలా పలువురు వలంటీర్లు ప్రజలకు అవసరమైన సేవలను వారి చెంతకు వెళ్లి అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

ఆస్పత్రికి వెళ్లి ..



గొల్లమడుగు గ్రామానికి చెందిన సుబ్బమ్మకు వృద్ధాప్య పెన్షన్ అందుతోంది. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతోపాటు కాళ్లకు శస్త్రచికిత్స చేయించుకొని వేలూరు సీఎంసీఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గొల్లమడుగు గ్రామానికి చెందిన వలంటీర్ చంద్రశేఖర్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న సుబ్బమ్మకు పింఛన్‌ను అందజేశాడు. మండలంలో సుమారు 10 మంది వలంటీర్ల వరకు ఇలా బయట ప్రాంతాల్లో ఉన్న వారికి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు.

సేవలకు సలాం!

- ప్రజలకు అందుబాటులో వలంటీర్లు
- గడప వద్దకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- వృద్ధులు, వితంతువులకు తప్పిన కష్టాలు



గుడిపాల: ప్రజల గడప వద్దకే సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. 2019 ఆగస్టు 15న ప్రారంభమైన ఈ వ్యవస్థ సేవాభావంతో విధులు నిర్వర్తిస్తోంది. వలంటీర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలను అందజేస్తున్నారు. మండలంలో 17 గ్రామ సచివాలయాల్లో 228 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వం పథకాలన్నీ లబ్ధిదారులకు చేరవేస్తున్నారు. పింఛన్ దగ్గర నుంచి అసవరమైన సర్టిఫికెట్ల వరకూ అన్ని రకాల సేవలు సకాలంలో ముంగిట్లోకి అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము తీసుకొనేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. చేతికి పింఛన్ సొమ్ము అందేందుకు మూడు నుంచి అయిదు రోజులు పట్టేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి చేరవేస్తున్నారు. అర్హులైన విద్యార్థులు సకాలంలో దరఖాస్తు చేసుకునేలా చూస్తున్నారు. ఇళ్ల స్థలాలు లేని నిరు పేదలను పార్టీలకతీతంగా గుర్తించి ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

సేవ చేయడం సంతృప్తినిస్తోంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు కుటుంబ సభ్యురాలిగా సేవలు అందించడం సంతోషంగా ఉంది. నేను ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్లు అందిస్తాను. ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వడం వల్ల వారి సంతోషానికి అవధులు ఉండవు. నా క్లస్టర్ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాను. ఈ సేవలోనే మాకు ఎంతో సంతృప్తి కలుగుతుంది. ప్రభుత్వం మా సేవలను మెచ్చి ప్రోత్సాహకాలు అందిస్తోంది.

– శేషమ్మ, వలంటీర్, దళవాయిపల్లె

ఇంటి వద్దకే పింఛన్



గతంలో పింఛన్ తీసుకోవడానికి మా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లేదాన్ని. అధికారులు వచ్చే వరకు వేచి ఉండాలి. గంటల తరబడి పడిగాపులు కాయడం వల్ల నీరసంతో కళ్లు తిరిగి పడిపోయిన సంఘటన కూడా ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత మా కష్టాలు తీరాయి. వలంటీర్ ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఈ వ్యవస్థ వల్ల మాకు ఎంతో మేలు జరుగుతుంది.

– నీలావతి, లబ్ధిదారు, గుడిపాల

నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేద్దాం



మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ నాగరాజు

ఐరాల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగరాజు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతకు, ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న నులిపురుగుల నివారణ కోసం ప్రతి సంవత్సరం ఆగస్టు 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని చెప్పారు. ఈ మాత్రలను మధ్యాహ్న భోజనం తర్వాత వేసుకునేలా చూడాలన్నారు. బడి బయట పిల్లలకు కూడా మాత్రలు అందజేయాలని సూచించారు. మండలంలో ఉన్న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించేలా వైద్యారోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత, ఎంఈఓ-2 దామోదర్‌నాయుడు, సీహెచ్‌ఓ సుగుణవతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ తోయా లక్ష్మి

గుడిపాల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తోయా లక్ష్మి పిలుపునిచ్చారు. కిల్లారిపల్లె, 189 కొత్తపల్లె, అంగన్‌వాడీ కేంద్రంలోని లబ్ధిదారులకు శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రేషన్‌ను ఇంటికే పంపిణీ చేస్తున్నామన్నారు. గర్భిణులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఒకసారి రక్తహీనతకు గురైతే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని, తద్వారా వ్యాధులు త్వరగా వస్తాయన్నారు. శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలని సూచించారు. దీనివల్ల భవిష్యత్‌లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, ఇందిర, గౌరీ, నిర్మల పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష

ఐరాల: బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఐలవారిపల్లెలో బాలింతలు, గర్భిణులు, తల్లులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డలు ఆరోగ్యకరంగా పెరగాలంటే తల్లిపాలు విధిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమ, సచివాలయ మహిళా పోలీసు భార్గవి పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



నూతన డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి

ఐరాల: విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం డిజిటల్ నూతన తరగతి గదిని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులు మంచి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. డిజిటల్ తరగతులు పేద విద్యార్థులకు వరంలాంటిదని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడిలో భాగంగా ఆకులు కత్తిరిస్తున్న అధికారులు, సిబ్బంది

గుడిపాల: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొలం పరిసరాల్లో విశ్లేషణ, శత్రు, మిత్ర పురుగులపై అవగాహన, వాటి జీవితచక్రంతో పాటు పంటను ఏ విధంగా కాపాడుకోవాలి అన్న అంశాలను వివరించారు. పురుగుమందులు వాడకుండా వేపగింజల కషాయాన్ని వాడాలని సూచించారు. వేరుశనగలో అంతరపంటగా ఆముదం, కంచె పంటగా జొన్నసాగు చేస్తే చీడపీడలు నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి ఉపయోగపడే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆకుల కత్తిరింపు ప్రయోగం చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు యోగప్రియ, లేష్మ, హనుమనాయక్, భువనేశ్వరి, నవీన్, వాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువ రాగిమానుపెంట సీఆర్‌సీలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఆర్‌సీ కార్యదర్శి, హెచ్‌ఎం సుజాత అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు హాజరయ్యారు. సీఆర్‌సీ పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేసిన 18 ఉపాధ్యాయులు బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లారు. వారికి సహోపాధ్యాయులు శాలువలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌సీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రభాకర్ వర్మ

గుడిపాల: మండలంలో ఉన్న భవిత కేంద్రాన్ని జిల్లా సహితవిద్య సమన్వయకర్త ప్రభాకర్ వర్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు లు పరిశీలించారు. విద్య గురించి భవిత ఉపాధ్యాయులు వాణి, బబితను అడిగి తెలుసుకు న్నారు. పిల్లల విద్యకు ఉపయోగించే బోధన పరికరాలను గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని పిల్లలకు సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జీతాలు వెంటనే చెల్లించాలని ఆపస్ జిల్లా అధ్యక్షులు మంజునాథగుప్త కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈవో విజయేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బదిలీలు పొందిన టీచర్లకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు





గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష, ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లె, జొన్నగురకల గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొరంపల్లెలో 80 మందికి వైద్య సేవలు

ఐరాల: మండలంలోని మొరంపల్లెలో ఫ్యామిలీ డాక్టర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 65 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, శాంతకుమారి, యమున, దివ్య, వరలక్ష్మి, రూబి పాల్గొన్నారు.

పోలీసులపై దాడి దుర్మార్గం

చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు ఘటన దుర్మార్గపు చర్య అని సీపీఐ జిల్లాకార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ, టీడీపీ నాయకులు పోలీసులపై దాడి చేయడం సరికాదన్నారు. శాంతియుతంగా మాట్లాడాల్సిన ప్రతిపక్షనేత రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం తగదని హితవు పలికారు. ఈ ఘటనకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



లబ్ధిదారుకు రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు : మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులతో ప్రజలకు రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పోలవరంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు మురళీకృష్ణ, ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విసయభాస్కర్, సర్పంచ్ నిరంజన్ రెడ్డి, రాజారత్నంరెడ్డి, మాసిలామణి, అమరనాథ రెడ్డి, కో–ఆప్షన్ మెంబరు ఖాదర్ వల్లి, ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు ప్రవీణ్, మని, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో వేడుకగా ఆడిపూజ





ప్రత్యేక అలంకరణలో శ్రీఅంకాళపరమేశ్వరి అమ్మవారు, ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



ఆటోనగర్‌లో కొలువుదీరిన నాగాలమ్మ

చిత్తూరు రూరల్: ఆరగించమ్మా...ఆడిపూజ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. నగరంలో శుక్రవారం ఆడిపూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునుంచే అమ్మవారిఆలయాల్లో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. బహు రూపాల్లో దేవతలు దర్శనమిస్తూ, భక్తులను కటాక్షించారు. సంతపేటలోని నాగాలమ్మ జాతరలో భాగంగా వీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే సీ.కే బాబు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. గుర్రప్ప నాయుడు వీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో పసుపుతో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూల స్థానంలోని అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంగా అంబలి, పిండి వంటలను సమర్పించారు. మొక్కులు చెల్లించుకుని తర్వాత అమ్మవారి పసుపు కోసం ఎగబడ్డారు. ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో నాగాలమ్మను కొలువుదీర్చి అంబలిపోశారు. ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కే ఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.